# అంతులేని చింత

భమిడిపాటి సోమయాజి

“ఏమిటోయ్ అంత హడావిడిగా పరిగెడుతున్నావ్'' అన్నారు కమలాకర్‌గారు.

“పరుగు కాదండి నడకే! పెళ్ళిళ్ళు కుదిర్చేవాళ్ళు పెళ్ళినడక నడిస్తే పన్లు అవుతాయా! రేపు మన తెలుగు ప్రొఫెసర్ మూర్తిగారబ్బాయిని పెళ్ళి చూపులకి తీసుకు వెడుతున్నాం'' అన్నాడు కామేశం.

“అబ్బ యిది ఎన్నోసారి! అతని యవ్వనమంతా పెళ్ళి చూపుల్లోనే అయిపోతోంది'' అన్నాడు కమలాకర్.



''ఇది ఆఖరిసారే అవుతుంది. ఈ దెబ్బతో పెళ్ళి కుదిరిపోతుంది. ఆ పిల్లకి తెలుగు యింగ్లీషు కూడా బాగావచ్చు'' అన్నాడు కామేశం.

''పిల్లకి భాషా పరిజ్ఞానం వుంటే పెళ్ళి కుదిరిపోతుందన్న మాట'' అన్నాడు అక్కడే వున్న కమలాకర్ మిత్రుడు.

''ఆ కుదురుతుంది. ఈ తెలుగు ప్రొఫెసర్‌గారి విషయం నీకు తెలీదు. ఆయనకి మన మాతృభాష మీద మక్కువ ఎక్కువ. కొంతవరకూ యింగ్లీషన్నా యిష్టమే! ఆయన ఒంటరిగా వున్నప్పుడు ''తెలుగదేల యన్న నేను తెలుగు విభుండ'' అన్న పద్యం చదువుకుని ఆనందపడతాడు. ప్రాచీన కవులంటే వల్లమాలిన అభిమానం''అన్నారు కమలాకర్‌గారు.

''అయ్యా! శెలవు యివ్వండి'' అంటూ వెళ్ళిపోయాడు కామేశం.

* * *

ఆ మర్నాడే సతీసమేతంగా కుర్రాడ్ని తీసుకుని పెళ్ళిచూపులకని, ప్రొఫెసర్ మూర్తిగారు బయల్దేరారు.

చింతామణిని సకల అలంకారాలు చేసి పెళ్ళి చూపులకి కూర్చోబెట్టారు. ఈ పిల్ల గారాల పట్టి! కొంచెం కోపం కూడా వుంది. మనిషి మంచిదే.

ప్రొఫెసర్ గారి భార్య చింతామణిని వంటలూ వార్పులు గురించి అడుగుతూ ఏం వంటలు బాగా చేస్తావని అడిగింది.

''కాఫీ బాగా వండుతానంది'' చింతామణి.

''కాఫీ బాగా పెడతానంటారు అందరూనూ. ఈ పిల్లేమిటి వండుతానంటోంది. ముక్కల పులుసులాగా, మరగ కాచి తగలేస్తుందేమో'' అనుకుంది ప్రొఫెసర్ గారి భార్య.

ప్రొఫెసర్ గారు మాత్రం ఆ ''వండుతాను'' అన్న పదప్రయోగానికి పరమానందపడ్డారు. అసలు పాత పదాలే, అంతకు ముందు ఎవ్వరూ వినని విధంగా, సందర్భానుసారంగా, వాడితేనే భాష పరిమళిస్తుందని ఆయన నమ్మకం.

''ఏదైనా నీకిష్టమైన తెలుగు పద్యం చదవమన్నారు ప్రొఫెసర్.

ఎక్కడి వాడీ! యక్ష తన యేందు జయంత వసంత కంతులన్ చక్కదనంబునన్ గెలువజాలిన వాడు.. నను వీడు పరిగ్రహించనన్'' అంటూ జంకులేకుండా అల్లసాని వారి పద్యం చదివింది.

ప్రొఫెసర్‌గారికి, అల్లసాని వారి మను చరిత్ర చాలా యిష్టం. ''పిల్లాడు తనకు నచ్చాడని చెప్పకనే చెప్పింది. పిల్ల వజ్రమే. పిల్లంటే యిలా వుండాలి'' అనుకున్నాడు ప్రొఫెసర్.

అడగకపోయినా చింతామణి తనంతట తానే యింగ్లీషులో కూడా ఒక పద్యం చదువుతానని ''బెటర్ నెవ్వర్ ట్రబుల్ ట్రబుల్, అన్‌టిల్ ట్రబుల్ ట్రబుల్స్‌యు, యు మేక్‌యువర్ ట్రబుల్ డబుల్ ట్రబుల్ వెన్ యు డు'' గడగడ చదివేసింది.

మొత్తం అన్నీ ట్రబుల్సే! అసలెన్ని ట్రబుల్స్ వున్నాయో లెక్కపెడదామని ప్రయత్నించిన పెళ్ళి కొడుకు వ్యవధి చాలక విఫలుడయ్యాడు. పెళ్లాడుతున్న ట్రబుల్ చూసి తల్లి బాధపడింది.

ఇంటికి వచ్చిన తర్వాత ప్రొఫెసర్ గారన్నారు. ''పెళ్ళిచూపులు సవ్యంగానే అయ్యాయి. పిల్లకూడా బాగుంది''

''పెళ్ళి చూపులదాకా ఎప్పుడూ సవ్యంగానే అవుతాయి. పిల్ల బాగుందంటున్నారు. అసలు నాకు తెలీక అడుగుతాను, శుభమా అని పెళ్ళి చూపులు అవుతూంటే, ఆ పిల్లేమిటండీ అడక్కుండానే 'ట్రబుల్ ట్రబుల్' అంటూ యింగ్లీషులో తగులుకుంది. పైగా ఆ అమ్మాయి పేరేమిటండీ. చింతామణి అంటూ పాత చింతకాయ పచ్చడిలాగా. 'చింత' అంటే విచారం కదా. ఈ కుమారీ మణి చింతను కలిగిస్తుందేమో'' అంది ప్రొఫెసర్ భార్య.

''ట్రబుల్స్ ఎప్పుడూ చెప్పొస్తాయా. అనుకోకుండా ఆ పద్యం చదివిందేమో. అయినా అన్ని ట్రబుల్స్ తడబడకుండా ఒకేసారి చదవడం చాలా కష్టం. ఈ పిల్ల ఎన్ని ట్రబుల్సయినా తట్టుకోగలదు. పైగా వెర్రిమొహమా! ఆ తెలుగు పద్యం చదవడంలో ఉద్దేశ్యం నీకర్థం కాలేదనుకుంటాను. పిల్లాడు తనకి నచ్చాడని ఆ పద్యం ద్వారా తెలియపరిచింది'' అన్నారు ప్రొఫెసర్.

''ఏమో! మా కాలంలో మేమిలా బరితెగించ






లేదు సుమండీ! పెళ్ళి చూపుల్లోనే పద్యాల ద్వారా పిల్లాడు నచ్చాడని చెప్పడం అవీ మాకు తెలియదు''

''ఏమీ తెలియని ముగ్ధవనే నిన్ను చేసుకున్నాను'' అన్నాడు ప్రొఫెసర్.

మొత్తం మీద చింతామణినే వధువుగా నిర్ణయించారు ప్రొఫెసర్‌గారు.

కొన్ని కొన్ని అపశ్రుతులు మినహా చింతామణి కళ్యాణం చాలా వైభవంగానే జరిగింది.

కొంతమంది చింతామణి తరపు బంధువులు యితర దేశాల్నుంచి కూడా వచ్చారు. అందులో ఆమె కజిన్ బ్రదర్ ఒకడు. అతను అమెరికాలోనే పుట్టిపెరిగాడు. తెలుగు బాగా తెలియదు. కాని మంచి తెలుగు మాట్లాడదామని కోరిక. మళ్ళీ అమెరికా వెళ్ళిపోతే తెలుగు మాట్లాడే అవకాశం తక్కువ. సరే! యీ పెళ్ళిలోనే తెలుగు మాట్లాడి అమెరికాలో పుట్టి పెరిగినా మాతృభాష బాగా మాట్లాడుతున్నాడనిపించుకోవాలని తహతహ! మేళగాళ్ళు సన్నాయి బాగా వాయిస్తూంటే వెళ్ళి వెళ్ళి ఆ తెలుగు ప్రొఫెసర్ గారితో వాద్యాలు బాగున్నాయి అన్నాడు. ఆ తెలుగు విని, వియ్యంకుడ్ని పిలిచి, ''తెలుగు రాకపోతే తేలుకుట్టిన దొంగలా పడుండాలి. ఆ వాద్యాలు ఎవరు వాయించినా మంగళ వాద్యాలే కాని యింకొకటి కాదు. అసలు 'మంగళ' మనే పదం అత్యంత శుభకరం! ఇటువంటి అపభ్రంశాలు నాకు సరిపడవు!'' అన్నారు తెలుగు ప్రొఫెసర్.

''క్షమించండి. ఆ కుర్రవెధవకి తెలుగు సరిగ్గా తెలియదు. అమెరికాలో పుట్టి పెరిగిన బడుద్ధాయి పాపం! నేను చెబుతాన్లెండి'' అన్నారు చింతామణి నాన్నగారు.

తర్వాత ఆ మేళగాళ్ళకి కోపం వచ్చి మధ్యలోనే వాద్యాలు ఆపేసి వెళ్ళిపోతామన్నారు. ప్రొఫెసర్ వెళ్ళి ఆ పిల్లాడికి తెలియక అలా అన్నాడన్నారు. ఒక పిల్లాడైతే ఫర్వాలేదండీ, ఇద్దరు ముగ్గురు పెద్ద వాళ్ళు కూడా అన్నారు. ప్రొఫెసర్ గారికి అసలు విషయం అర్థం కాలేదు. ఏమన్నారంటే, ''పిచ్చి మేళం'' అన్నారని చెప్పారు ఆ మేళగాళ్ళు.

అలా అనడమేమిటంటే, చింతామణి నాన్నగారు ''అబ్బే! మావాళ్ళు అటువంటి మాటలు అనర''ని సర్దిచెప్పి ఆ మేళగాళ్ళకి రెండోసారి కాఫీ టిఫిన్లు ఏర్పాటు చేసి వారిని శాంతింప చేశారు. తర్వాత చింతామణి నాన్నగారు ఆ విషయం గురించి విచారిస్తే ''పిచ్చిమేళం'' అన్న మాట వాస్తవమేననీ, ఎవరో మొగపెళ్ళివారిలో యిద్దరు ముగ్గురు లాల్చీ సఫారీ టక్ చేసి తిరుగుతూంటే వారిని ఉద్దేశించి అన్నట్లూ, అది విని మేళగాళ్ళు తమని పిచ్చిమేళం అనుకున్నారనీ తేలింది.

మంచి తెలుగు మాట్లాడాలన్న తహ తహ తీరక, చింతామణి అమెరికా కజిన్ మళ్ళీ రంగంలో దిగాడు. ''ముహూర్త కాలం సమీపిస్తోంది'' అనడానికి బదులు ''కాలం సమీపిస్తోంది'' అన్నాడు. అది విన్న తెలుగు ప్రొఫెసర్‌కి వెర్రికోపం వచ్చింది. వాడి దవడ మీద ఒక గట్టి లెంపకాయ లాగాడు. పీటల మీదున్న చింతామణి.. తన కజిన్‌ను కొట్టడం చూసి చాలా బాధపడింది. అమెరికా నుంచి అంత డబ్బు ఖర్చుపెట్టుకుని వచ్చింది యీ లెంపకాయ తినడానికా అని చింతామణి కజిన్ బాధపడుతూంటే, వాడ్ని పక్కకి పిలిచి 'అలా ఎందుకనుకుంటావు.. యీ లడ్డూలు, అరిశెలు, సున్నుండలూ కూడా తినమన్నారు. పాపం!వాడికి చిన్నప్పట్నుంచీ 'తీపి' అంటే చాలా యిష్టం' అవి తిని సంతోషించాడు.

* * *

అప్పగింతలయి విడిది గృహప్రవేశం దాకా వచ్చింది పెళ్ళితంతు! పేర్లు చెప్పమన్నారు పెళ్ళికొడుకు. ''చింతామణి'' అని వధువు పేరు చెప్పాడు. పెళ్ళికొడుకు పేరు చెప్పడం యిక చింతామణి వంతైంది. ఏమిటో పెళ్ళికూతురు చాలా విచారంగా వుంది. తన అమెరికా కజిన్ లెంపకాయ కొట్టడం, బిందెలో ఉంగరం తనని తియ్యనీయకపోవడం, ఎక్కువ కట్నం తీసుకుని తక్కువ బంగారం పెట్టడం వగైరా సహించలేకపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూండగా ''పండిత పుత్రులు బావా నేనూ వచ్చాం'' అంది. అందరూ ఆశ్చర్యపోయారు.

''అమంగళం అప్రతిహతమగు కాక'' అన్నాడు ప్రొఫెసర్.

బ్రహ్మగారు ''అమ్మా! చింతామణీ! కుడికాలు గడపలో పెట్టమ్మా! అంటే ''ఉండు నీ రోగం కుదురుస్తానన్నట్లు'' ఎడంకాలు లోపల పెట్టింది.

ఇవన్నీ చూసి ప్రొఫెసర్ తల తిరిగిపోయింది.

''నువ్వు చెప్పింది నిజమే! యీ చింతామణి వల్ల బోల్డు ట్రబుల్సుగా వున్నాయి. చింతామణి అంటే చింతను కలిగించేది అని నువ్వు చెప్పినా తెలుసుకోలేక ఈ సంబంధం ఖాయం చేశాను'' అనుకున్నారు ప్రొఫెసర్ భార్యకేసి చూస్తూ.

''నేనేం చెప్పినా మీరు వినరు కదా! మీకు భాషాభిమానం తప్ప యింకేం తెలియదు. అయినా యీ పిల్ల పెళ్ళిచూపుల్లో ట్రబుల్, ట్రబుల్ అంటూ మొదలుపెట్టింది. పైగా అంకురార్పణ జరుగుతూంటే 'అమ్మా! నా సవరం ఊడిపోయిందే' అని ఏడుపు! అసలా పిల్లది సవరమా జడా అని కూడా తెలుసుకోలేక పోయాం'' అని మెల్లిగా అంది ప్రొఫెసర్‌గారి భార్య.

ప్రొఫెసర్‌గారు ఒక నెల శెలవు పెట్టేశారు. ఆయన భార్య కొన్నాళ్ళు తలకి గుడ్డ కట్టుకుని పడుకుంది.

అత్తింట్లో చింతామణిని 'చింతా చింతా' అని ముద్దుగా పిల్చుకునేవారు.

★

## కాయిన్స్ కనుమరుగు

కరెన్సీ కాయిన్స్. చరిత్రకున్నంత వయసూ వీటికీ వుంది. విశేషమేంటంటే, నాణేలు కనుమరుగవుతున్నట్టే వాటి గురించి తెలియని జనాలు కూడా ఎక్కువవుతున్నారు. కాని, అణా, అర్ధణా, పైసా, ఐదు, పది, ఇరవై పైసల నుంచి ఇప్పటి రూపాయి రెండ్రూపాయల వరకూ మనకు తెలిసినవి కొన్ని. అంతకు ముందే మహానుభావుల ముఖచిత్రాలతో వచ్చిన నాణేలు, పల్లవులు, ఇక్ష్వాకుల కాలంలో వచ్చిన నాణేలూ వున్నాయి. కాసులంటే ఒకప్పుడు నాణేలే అనికూడా పేరుండేదిట. ఇంకా చెప్పాలంటే కాసుల గలగలలు కూడా ఈ నాణేల నుంచి ఉద్భవించిన మాటే. చెరగని చిరగని పదాలకూ ఇవే సాక్ష్యాలు. రానానూ కరెన్సీ కాగితాలుగా మారి ఆపైన ఫైబర్ స్థానంలోకి వెళ్ళిపోయికుంది. నాణేలు షోకేసు బొమ్మల్లానూ, సేకరణకు పనికొచ్చేవిగానూ మాత్రమే మిగిలిపోతున్నాయి. ఇప్పుడు మాటలు రాని కరెన్సీ మౌనంగా వుంటుంది జేబులో!